క్లుప్తంగా

నేడు వైఎస్సార్ ఆసరా సంబరాలు

గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్ ఆసరా సంబరాలు గుమ్మలక్ష్మీపురం బీఎస్ఆర్ కళింగ వైశ్య కల్యాణ మండపం వద్ద గురువారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఆదయ్య బుధవారం తెలిపారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడత గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన 565 డ్వాక్రా సంఘాల్లోని 6317 సభ్యులకు రూ.2.15 కోట్లను ప్రభుత్వం జమ చేసిందని, ఈ నేపథ్యంలోనే మండల స్థాయిలో వైఎస్సార్ ఆసరా సంబరాలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి పాల్గొంటారని తెలిపారు.

పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కురుపాం: రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల కోసం ప్రవేశ పెట్టిన పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారిణి కె.శైలజ అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ పాడి రైతులు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకందారుల కోసం ప్రభుత్వం నూతనంగా (లైవ్ స్టాక్ ఇన్స్యూరెన్స్ స్కీం) పశు బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. గతంలో ఉన్న వైఎస్సార్ పశు నష్ట పరిహారం పథకం స్థానంలో ఈ పథకం నూతనంగా ప్రారంభించిందని లబ్ధిదారుల వాటా వాటా ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులకు 20 శాతం, ఏపీఎల్ లబ్ధిదారులకు 50 శాతంగా నిర్ణయించిందన్నారు. వివరాలకు సమీపంలో ఉన్న రైతు భరోసా కేంద్రాలను, పశువైద్య అధికారులను సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ భవనాలు ప్రారంభం



రైతు భరోసా కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: మండలంలోని సింగన్నవలస గ్రామంలో రూ.కోటితో నిర్మాణం చేపట్టిన ప్రభుత్వ భవనాలను ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ బుధవారం ప్రారంభించారు. గ్రామంలో రైతు భరోసా కేంద్రం, గ్రామీణ వైద్య కేంద్రం, సచివాలయ భవనాలను ప్రభుత్వం మంజూరు చేయగా వాటి నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటిని ప్రారంభించిన ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ సేవలు ప్రజల వద్దకు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ చేయడం ద్వారా మంచి పాలన అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.భాను, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్‌రావు, వాకముడి అనిల్‌కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రుణ వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ

భామిని: మహిళా సంఘాలకు ఇచ్చిన స్త్రీనిధి, ఉన్నతి, సీఎంఎఫ్ నిధుల రుణ వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ సారించాలని వెలుగు ఏపీఎం దొడ్డ భవానీ కోరారు. వెలుగు కార్యాలయంలో సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో రుణాలపై సమీక్షించారు. ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన సున్నా వడ్డీ నిధులు, ఆసరా నిధులు, మహిళా సంఘాల సభ్యుల ఖాతాలకు జమ కానున్నాయన్నారు. సీసీలు, సీఓలు, వీఓఏలు ఉన్నారు.

రెండో విడత భూ పంపిణీకి ఏర్పాట్లు



ఇళ్ల స్థలాల జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

వీరఘట్టం: మండలంలోని సొంతిళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి గ్రామాల వారీగా అర్హుల జాబితాలను వీఆర్‌ఓలు బుధవారం సిద్ధం చేయగా, తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ పరిశీలించారు. ఈ జాబితాను కలెక్టర్‌కు నివేదించి కొద్ది రోజుల్లోనే రెండో విడత భూ పంపిణీ చేపడతామన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు భేష్



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ప్రత్యేకాధికారి

పాలకొండ: జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా నోడల్ అధికారి ఎం.నారాయణరావు తెలిపారు. పట్టణంలోని వెంకమ్మపేట పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇటువంటి మంచి కార్యక్రమాలను చేపడుతుందని వివరించారు. మొత్తం 484 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది టి.రమేష్ జయగౌడ్, కె.తేజ్ రతన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి



మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు

- మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యతనిచ్చింది జగనన్నే..
- వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి
- ప్రతిపక్షాల మాయ మాటలను నమ్మి మోసపోవద్దు...
- వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు



కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు

కురుపాం: మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యతనిచ్చి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి నిండు మనసుతో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు కోరారు. కురుపాం నియోజకవర్గ కేంద్రంలో వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ అక్కచెల్లెమ్మలకు ఆర్థికంగా చేయూతనిచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, అమ్మ ఒడి తదితర సంక్షేమ పథకాలను సీఎం జగనన్న అమలు చేస్తున్నారన్నారు. చంద్రబాబునాయుడు పాలనలో మహిళలకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ హామీని నెరవేర్చారన్నారు. జగనన్న పాలనలో మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించడమే కాకుండా సంక్షేమ పథకాలను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకే జమ చేశారన్నారు. మాట ఇస్తే మడమ తిప్పని నైజం జగనన్నది అన్నారు. అనంతరం మండలంలోని మహిళలకు వైఎస్సార్ ఆసరా కింద రూ.3 కోట్ల 5లక్షల 15 వేలు, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద రూ.2కోట్ల 50లక్షలను నాలుగో విడత కింద పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, జిల్లా కోఆప్షన్ సభ్యుడు నిషార్, గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు కోటేశ్వరరావు, మండల కన్వీనర్ గౌరీశంకరరావు, ఎంపీటీసీలు వెలమల బంగారునాయుడు, స్వామియాజులు, వైస్ ఎంపీపీ అన్నాజీరావు, రంగారావు, కళింగ వైశ్య కార్పొరేషన్, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్లు కె.సురేష్, జి.విజయ్, ఎంపీడీఓ అప్పారావు, ఏపీఎం వి.కిశోర్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో డ్రైవర్స్ డే



డ్రైవర్లకు సూచనలు చేస్తున్న డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు తదితరులు

పాలకొండ రూరల్: ఆర్టీసీలో రథసారథులైన డ్రైవర్ల విధులు, సేవలు అభినందనీయమని పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ వి.వెంకటేశ్వరరావు అన్నారు. డ్రైవర్స్ డే సందర్భంగా స్థానిక డిపో ప్రాంగణంలో ప్రత్యేక సమావేశం బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ డ్రైవర్లను సన్మానించారు. డీఎం మాట్లాడుతూ ఉత్తమ డ్రైవర్లుగా గుర్తింపు పొందేందుకు క్రమశిక్షణ, వృత్తి పట్ల అంకితభావం అవసరమన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సహాయ మేనేజర్ లక్ష్మణరావు, సహాయ మెకానికల్ ఇంజినీరు రాజు, హెడ్ క్లర్క్ నాయుడు, సెక్యూరిటీ అధికారి రాంబాబు, ఎస్‌డీఐ రాజు, ఏడీసీ కృష్ణమూర్తి, వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నెలాఖరుకు మూడో విడత భూసర్వే పూర్తి



సర్వే టీమ్‌తో సమీక్ష నిర్వహిస్తున్న డిప్యూటీ సర్వేయర్ ప్రసాద్

వీరఘట్టం: పాలకొండ డివిజన్‌లో 52 రెవెన్యూ గ్రామాల్లో జరుగుతున్న మూడో విడత భూసర్వేను ఈ నెలాఖరుకు పూర్తి చేస్తామని డివిజనల్ డిప్యూటీ సర్వేయర్ కె.ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సర్వే బృందంతో బుధవారం సమీక్ష నిర్వహించారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ చేపడుతున్నామని తెలిపారు. ఇంకా 9 గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ చేయాల్సి ఉందన్నారు. ఈ నెలాఖరుకు సర్వేతో పాటు స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్
- తంపటాపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



తంపటాపల్లిలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పాలన వివరిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

పాలకొండ రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని తంపటాపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు అల్లు శ్రీరామ్మూర్తి నాయుడు, సురేష్ కుమార్, దిలీప్‌కుమార్ నేతృత్వంలో బుధవారం జరిగింది. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా అందుతున్న సంక్షేమ లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ రక్షిత కుళాయి నీరు అందించే పనులకు శంకుస్థాపన చేశారు. స్థానికుల వినతి మేరకు వీధుల్లో సీసీ రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.20లక్షలు జీజీఎంపీ ద్వారా కేటాయిస్తామన్నారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను ప్రజలే తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మాళి సుదాభాను, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రణస్థలం రాంబాబు, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లి శివప్రసాద్, మజ్జి నవీన్‌కుమార్, సీహెచ్ జగదీష్ కుమార్, విజిలెన్స్ కమిటీ సభ్యులు మొయ్యి లక్ష్మీకుమారి, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు బి.పార్వతి, తలే ఆనంద్‌పాల్, గేదల రమణ, అల్లు ఈశ్వరరావు, పలు శాఖల అధికారులు, సిచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చినమేరంగి ఎస్‌ఐగా చిన్నంనాయుడు



జియ్యమ్మవలస: చినమేరంగి ఎస్‌ఐగా చిన్నంనాయుడు బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన విశాఖ జిల్లా పెందుర్తి పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతో శాంతిభద్రతలు పరిరక్షిస్తానని చెప్పారు. ఇక్కడ ఎస్‌ఐగా పని చేసిన కళాధర్ జిల్లా కేంద్రంలో సీసీఎస్‌కు బదిలీపై వెళ్లారు.

శతశాతం హాజరు చూపించాలి

భామిని: ఉపాధి హామీ పథకంలో నమోదైన వేతనదారులంతా పనులకు శతశాతం హాజరయ్యేలా చూడాలని ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి, ఏపీఓ ఇ.తులసీదాస్ అన్నారు. ఉపాధి హామీ టీఏలు, సీఓలు, ఎఫ్ఏలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి జీపీలోనూ విధిగా శతశాతం వేతనదారుల హాజరు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

భద్రతకు తొలి ప్రాధాన్యత



రోడ్డు భద్రతా మాసోత్సవాలపై అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ వేణుగోపాలరావు

పాలకొండ రూరల్: వాహన చోదకులు రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా వ్యవహరించాలని, భద్రతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని మోటారు వెహికల్ అధికారి తంగి వేణుగోపాలరావు అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశాల మేరకు పాలకొండ - శ్రీకాకుళం రహదారిలో అవగాహన కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. వాహన చోదకులు పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. అతివేగం, మద్యం సేవించి, సెల్‌ఫోన్లు మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇవ్వరాదని సూచించారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



సీతంపేట: ర్యాలీలో పాల్గొన్న పీఓ కల్పనాకుమారి, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి



గుమ్మలక్ష్మీపురం: డిగ్రీ కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవ ర్యాలీ

సీతంపేట: అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాల నుంచి అడ్వంచర్ పార్కు వరకు విద్యార్థినులు ర్యాలీ చేశారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి పాల్గొన్నారు. హడ్డుబంగిలో అక్కడి ఆశ్రమోన్నత బాలికల పాఠశాల విద్యార్థులు హెచ్ఎం ఉమావాణి ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు.

బాలికా దినోత్సవ ర్యాలీ

పాలకొండ రూరల్: జాతీయ బాలికా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థినులు సమాజంపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ శిమ్మాలమ్మ, సూపర్‌వైజర్ టి.మేరీ అన్నారు. స్థానిక ఇందిరానగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బాలికల హక్కులపై అవగాహన కల్పించారు. విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. పెద్దకాపువీధి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జనచేతన కోఆర్డినేటర్ ఏపీ ప్రో చైల్డ్ గ్రూప్ రీజనల్ కన్వీనర్, జనచేతన స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి బగాది శశిభూషణ చౌదరి నేతృత్వంలో బాలికా దినోత్సవం నిర్వహించారు. చట్టాలపై అవగాహన కల్పించారు.

వీరఘట్టంలో..

వీరఘట్టం: అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండంలోని పలు పాఠశాలలో విద్యార్థినులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీల ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ర్యాలీ నిర్వహించారు. బాలికలకు ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పీఓ సిమ్మాలమ్మ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగించుకొని బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం అన్నారు. డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం నేషనల్ గర్ల్స్ చైల్డ్ డే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా అధ్యాపకులు డి.శ్రీలక్ష్మి, జి.తులసి తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లిలో..

గరుగుబిల్లి: మండల కేంద్రంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు ర్యాలీని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు కెకె.సాగర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ రూరల్: ఇందిరానగర్ కాలనీలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ అధికారులు



వీరఘట్టం: ర్యాలీలో పాల్గొన్న బాలికలు, అంగన్‌వాడీలు



గరుగుబిల్లి : బాలికా దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు, ఐసీడీఎస్ సిబ్బంది

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి, చిత్రంలో ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు



సమరానికి సిద్ధంకండి

- 27న భీమిలి సభ విజయవంతం చేయాలి
- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

పాలకొండ: రానున్న ఎన్నికల్లో పార్టీని ముందుండి నడిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. పట్టణంలోని ఏఎంజీ ఫంక్షన్ హాల్లో నియోజకవర్గ స్థాయి పార్టీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ఈ నెల 27న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి భీమిలో చేపడుతున్న సభను విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికల జరగనున్న నేపథ్యంలో పార్టీ కోసం కష్టపడి పని చేసి, మళ్లీ జగన్‌ను సీఎంగా చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల కోసం ఇంతవరకు వైఎస్సార్‌సీపీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు. సమావేశంలో నాలుగు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



కళ్లికోటలో సచివాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కొమరాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో జరుగుతున్నాయని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని గుణానపురం, కళ్లికోట గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలను సర్పంచ్‌లు దత్తి మురళీకృష్ణ, మిరియాలు పద్మావతి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. అంతకు ముందు ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ ఫలాలు ప్రజలకు గ్రామాల్లోనే గడప చెంతకే చేరుతున్నాయన్నారు. వలంటీర్లు ఇంటికొచ్చి సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని చెప్పారు. గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతిగా ఘనతకెక్కారన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను మళ్లీ సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, మండల పార్టీ కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, నాయకులు కళింగి మల్లేశ్వరరావు, డాక్టర్ శెట్టి మధుసూదనరావు, శివిని పీఏసీఎస్ అధ్యక్షుడు పప్పల గోపాలకృష్ణ పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ధాన్యం కొనుగోలు



కత్తులకవిటి ఆర్‌బీకేలో ఆఖరి ధాన్యం లోడ్‌ను తరలిస్తున్న సిబ్బంది, రైతులు

వీరఘట్టం: మండలంలోని కత్తులకవిటి రైతు భరోసా కేంద్రం పరిధిలో బుధవారంతో శతశాతం ధాన్యం కొనుగోలు పూర్తి కావడంతో ఆఖరి లారీతో ధాన్యం లోడ్ వెళ్లడంతో ఆర్‌బీకే సిబ్బంది కొబ్బరి కాయ కొట్టేశారు. మొత్తం 351 మంది రైతుల నుంచి 20,200 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్టు అగ్రికల్చరల్ అసిస్టెంట్ వెలగాడ గుణశేఖర్ తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యంలో ఇంత వరకు 15 వేల క్వింటాళ్లకుగాను రూ.3,27,45,000 ను రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. ఇంకా 60 మంది రైతులకు సంబంధించిన 5200 క్వింటాళ్ల ధాన్యం డబ్బులు రావాల్సి ఉందన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సీజన్ ముగించామన్నారు. ప్రభుత్వ చర్యలతో రైతులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టిన ఆర్‌బీకే సిబ్బంది జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, ఎంపీటీసీ కొత్తవలస పరిమళ, సర్పంచ్ గేదెల సరోజనమ్మ అభినందించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



పాలకొండ: ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



కురుపాం: బాక్సింగ్ క్రీడాకారుడు, అర్జున అవార్డు గ్రహీత సీర జయరాంను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు

క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం సమకూరుతుందని ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, పాముల పుష్పశ్రీవాణి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం... ఆంధ్రా క్రీడా పోటీలు నియోజకవర్గ స్థాయిలో బుధవారం ప్రారంభమయ్యాయి. వీటిని ప్రారంభించిన ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ క్రీడలతో మంచి ఉద్యోగాలు కూడా సంపాదించవచ్చన్నారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కురుపాం: ఆడుదాం.. ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

రోడ్డు ప్రమాదంలో జేఎల్‌ఎంకు గాయాలు

భామిని: మండలంలోని వడ్డంగి జేఎల్‌ఎం కొట్టుగుమ్మడి శంకరరావు బుధవారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఏబీ రోడ్డులో సతివాడ సమీపంలో బైక్‌పై శంకరరావు వస్తుండగా అదుపు తప్పి బైక్ బోల్తా పడింది. గాయపడిన శంకరరావును కొత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.